క్లుప్తంగా

మెగా జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి తుడా: తిరుపతిలో ఈ నెల 8వ తేదీ జరగనున్న మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను సోమవారం తన కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలోని భవానీ నగర్ సర్కిల్‌లో ఉన్న గీతం స్కూల్‌లో 8వ తేది ఉదయం 8 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శ్రీసిటీ, మేనకూరు సెజ్, ఈఎంసీ క్లస్టర్, తిరుపతి, బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలోని 16 బహుళ జాతీయ కంపెనీల్లో 700 పైగా ఉద్యోగాల కోసం మేళాలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, ఎస్వీ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ రమణ, సురేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతపై అవగాహన

తిరుపతి తుడా: స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్, మైక్రోబయాలజీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పద్మావతి ఆడిటోరియంలో ప్రపంచ చేతి పరిశుభ్రత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజ్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విశ్వేశ్వర రావు మాట్లాడుతూ కోవిడ్ తరువాత చేతుల పరిశుభ్రతపై అవగాహన పెరిగిందన్నారు. మైక్రోబయాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నోబెల్ ఉజేష్ మాట్లాడుతూ పిల్లలకు చిన్నప్పటి నుంచే చేతులను శుభ్రం చేసుకునేలా అలవాటు చేయాలన్నారు. వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేలకూలిన వృక్షాలను తొలగించండి



అధికారులతో చర్చిస్తున్న మేయర్ డాక్టర్ శిరీష

తిరుపతి తుడా: నగరంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి నేల కూలిన భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలను త్వరగా తొలగించాలని తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష నగరపాలక ఇంజినీరింగ్ అధికారులను, విద్యుత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె అధికారులతో కలిసి 11, 27వ డివిజన్ల పరిధిలోని చిన్న కాపు వీధి, పెద్దకాపు వీధి, తాతానగర్‌లో పర్యటించారు. నేలకూలిన భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలను త్వరగా తొలగించాలని, డ్రైనేజ్ వ్యవస్థ పునరుద్ధరణ కోసం స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో ధ్వంసమైన కార్లు, ఆటోలు, షాపులను పరిశీలించారు. వీఆర్వోతో చర్చించి షాపుల యజమానులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం మేయర్ మీడియాతో మాట్లాడుతూ ఆదివారం అకాల వర్షం నగరంలో బీభత్సం సృష్టించిందన్నారు. వృక్షాలు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లు తెగిపడ్డాయని, సకాలంలో నగర పాలక అధికారులు, విద్యుత్ అధికారులు వాటిని సరి చేసే కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో మేయర్‌తో పాటు మున్సిపల్ ఇంజినీర్ తులసి కుమార్, డీఈ రాజు, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి, నాయకులు దొడ్డారెడ్డి మునిశేఖర్ రెడ్డి, తులసి యాదవ్, బాష, కృష్ణ, విద్యుత్ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉపాధి కల్పించాలని పోర్టర్ల వినతి



తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న రైల్వే కూలీలు

తిరుపతి మంగళం : తిరుపతి రైల్వేస్టేషన్ ఆధునీకరణ కారణంగా తాము ఉపాధిని కోల్పోతున్నామని, తమకు ఏదో ఒక రూపంలో ఉపాధి కల్పించాలని తిరుపతి రైల్వే కూలీలు ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తిని కోరారు. ఈ సందర్భంగా సోమవారం తిరుపతిలోని పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో గత 15 నుంచి 30 ఏళ్లుగా సేవలందిస్తున్న లైసెన్స్‌డ్ పోర్టర్లు ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తమ జీవనోపాధి కోసం స్టేషన్ ఆధారిత ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వడం, లైసెన్స్‌డ్ పోర్టర్ సేవలను కొనసాగించాలని కోరారు. స్పందించిన ఎంపీ గురుమూర్తి, రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు అప్పటికప్పుడే లేఖ రాశారు. అలాగే రైల్వేపోర్టర్ల సుదీర్ఘ సేవలను పరిగణనలోకి తీసుకుని జీవనోపాధి కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలని లేఖలో రైల్వే మంత్రిని ఎంపీ కోరారు.

కారు ఢీకొని స్కూటరిస్ట్ మృతి

పాకాల : ముందు వెళ్తున్న స్కూటరిస్టును వెనుక నుంచి కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని సల్లాపురం ఆలయం వద్ద కల్లూరు నుంచి దామలచెరువు వైపు నరసింహులు(51) బైక్‌లో వస్తుండగా వెనుక నుంచి అదే దారిలో వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో నరసింహులు అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతని స్వగ్రామం సదుం మండలం గాదేవారిపల్లి, అయితే చాలాకాలంగా దామలచెరువు పంచాయతీ శాంతినగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ సంజీవరాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యేని నిలదీసిన రూరల్ ప్రజాప్రతినిధులు

- ప్రభుత్వ ఆస్తులపై పచ్చరంగులు తొలగించాలని తీర్మానం
- హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తే ఇబ్బందులు తప్పవు
- అధికారులను హెచ్చరించిన ఎంపీపీ
- భూ ఆక్రమణలు, మట్టి, ఇసుక తవ్వకాలపై సభ్యుల ఆగ్రహం
- సర్పంచ్‌ల అధికారాలను అడ్డుకుంటారా అంటూ ఎమ్మెల్యేపై అసహనం



హాజరైన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు



మండల మీట్‌లో పాల్గొన్న ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే నాని

తిరుపతి రూరల్: గత ప్రభుత్వంలో ప్రజల సౌకర్యార్థం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి వేసిన సిమెంటు బల్లలకు పసుపు రంగులు వేయడం, తాజాగా వేదాంతపురం గ్రామ పంచాయతీ సమీపంలో అండర్ గ్రౌండ్ సంపును మండల పరిషత్ నిధులతో మరమ్మతులు చేస్తే.. ఆ సంపునకు కూడా పసుపు రంగు వేస్తారా ? అని ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. సోమవారం తిరుపతి రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన వాడీవేడీగా సాగింది. ముందుగా ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి అజెండా ప్రకారం సభ్యులు అడిగే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాలని, అలాగే గత సమావేశంలో సభ్యులు తెలిపిన సమస్యలు ఎంతవరకు పరిష్కరించారనే విషయాలను సభ్యులకు వివరించాలన్నారు.

పచ్చరంగులు తొలగించాలి

ప్రభుత్వ ఆస్తులపై పచ్చ రంగులు తొలగించాలని మండల సమావేశంలో తీర్మానించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులకు పార్టీ రంగులు ఎలా వేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తులకు రాజకీయ పార్టీల రంగులు వేయకూడదని హైకోర్టు ఆదేశించిందని తెలిపారు. మండల పరిషత్ తీర్మానాన్ని హైకోర్టుకు పంపుతామని, అధికారులపై చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ అంశంపై ఎంపీపీ, ఎమ్మెల్యే నాని మధ్య కొంతసేపు తీవ్రస్థాయిలో వాదోపవాదనలు చోటు చేసుకున్నాయి.

యథేచ్ఛగా రూ.కోట్ల విలువైన భూఆక్రమణలు

తిరుపతి రూరల్ మండలంలో రూ.కోట్లు విలువైన ప్రభుత్వ భూములు, మఠం భూములు ఆక్రమణకు గురవుతున్నాయని.. వాటిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే కనీస స్పందన లేదని.. ఆక్రమణదారులకు ఎమ్మెల్యే నాని సపోర్టు చేస్తున్నట్లు చెబుతున్నారని పేరూరు సర్పంచ్ దామినేటి కేశవులు ఆరోపించారు. అలాగే వైస్ ఎంపీపీ యశోద మాట్లాడుతూ స్వర్ణముఖి నదిలో రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక తవ్వేస్తున్నారని, చాలాచోట్ల గంజాయి విచ్చలవిడిగా చేతులు మారుతోందని, తక్షణం అరికట్టాలని కోరారు. పాడిపేట సర్పంచ్ ధనమునిరెడ్డి మాట్లాడుతూ పాడి చెరువులో స్థానిక టీడీపీ నాయకులే దగ్గర ఉండి మట్టి అమ్ముతున్నారని ఆరోపించారు. దీనిపై నీటి పారుదల శాఖ అధికారులు కల్పించుకుని చెరువులో మట్టి తవ్వకాలు జరగకుండా చూస్తామని, రెవెన్యూ అధికారులు కూడా మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని ఎంపీపీ సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ నిధులతో సర్పంచ్ అధికారాలను కార్యదర్శులతో అడ్డుకుంటారా..? పంచాయతీ నిధులపై మీ అజమాయిషీ ఏమిటి..? సర్పంచ్‌లుగా ఇక మేము ఎందుకు ? అంటూ పేరూరు సర్పంచ్ దామినేటి కేశవులు, సి.మల్లవరం సర్పంచ్ మొక్కల భారతి ఎమ్మెల్యే నానిని సభాముఖంగా నిలదీశారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు విడుదల మాధవ రెడ్డి, వేముల యశోద, జెడ్పీటీసీ రత్నమ్మ, ఎంపీడీఓ రామచంద్ర, తహసీల్దార్లు రామాంజులు నాయక్, భాగ్యలక్ష్మి, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి కూటమి సర్కార్ తీరని అన్యాయం



ఆర్డీఓ రామ్మోహన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ నేతలు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులకు సర్కార్ తీవ్రమైన అన్యాయం చేస్తోందని మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శి బీఎస్ బాబు మండిపడ్డారు. ఆయన నేతృత్వంలో సోమవారం తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు ప్రత్యేక సెలవులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. మరోవైపు ఉద్యోగ విరమణ పొందిన ఆర్టీసీ ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం లేక, ఆరోగ్యశ్రీ వర్తించడం లేదని మండిపడ్డారు. పలువురు ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వడం లేదు.....

వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం ఇవ్వడం లేదని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ తెలిపారు. ఆర్డీఓ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ నేతల ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టారు.

ఉపాధి హామీలో అవినీతిని నిరూపిస్తాం

- అక్రమాలు జరగలేదని నిరూపించేందుకు మీరు సిద్ధమా ?
- మీడియా సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న పార్టీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి

చంద్రగిరి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని టీడీపీ నాయకులు ఆదాయ వనరుగా మార్చుకుని భారీగా అవినీతికి పాల్పడ్డారని, అందులో అవకతవకలను, నిజాలను నిగ్గు తేల్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, పార్టీ నేతలతో కలసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 10 నెలల కాలంలో ఉపాధి పథకంలో భారీ అవినీతికి పాల్పడినట్లు ఆరోపించారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధారాలతో సహా మీడియాకు వెల్లడించినట్లు తెలిపారు. అయితే చేసిన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు టీడీపీ నాయకులు అర్థం లేని ప్రేలాపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడో ఉండే వ్యక్తులు నియోజకవర్గంలో ఏమి జరుగుతుందో తెలియకుండా తమ నాయకుడిపై అర్థం లేని ఆరోపణలు చేయడం మానుకోవాలని హితువు పలికారు. యంత్రాలతో అక్రమంగా పనులు చేపట్టి, దొంగ మస్టర్లతో భారీగా ప్రజాధనాన్ని లూటీ చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. మీరు చేస్తున్న అవినీతిపై ఆధారాలతో సహా నిరూపించేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉందని, జరగలేదని నిరూపించేందుకు మీరు సిద్ధంగా ఉంటే చర్చకు రావాలన్నారు.

వ్యవస్థలను పక్కదోవ పట్టిస్తున్నారు

ఉపాధిహామీ పథకంలో జరిగిన అవినీతిపై ఆరోపణలు వస్తున్న క్రమంలో వాటిని సరిదిద్దుకోకుండా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డిపై అసత్య ఆరోపణలు చేయడం సబబు కాదని సింగిల్‌విండో మాజీ చైర్మన్ మల్లం చంద్రమౌళి రెడ్డి మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో 40 మందికి పైగా ఫీల్డ్ అసిస్టెంట్‌లను అక్రమంగా తొలగించలేదా అని ప్రశ్నించారు. రోడ్డున పడిన ఫీల్డ్ అసిస్టెంట్లు కడుపు మండి 10 నెలలుగా జరుగుతున్న అవినీతిపై సమగ్రంగా ఆధారాలతో సహా నివేదిక సమర్పించారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్ రెడ్డి, ఐతేపల్లి సింగిల్‌విండో మాజీ చైర్మన్ దేవారెడ్డి, ఎంపీటీసీలు దెయ్యాల మాధవ రెడ్డి, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు శివశంకర్ రెడ్డి, నేతలు మస్తాన్, అజయ్, కొత్తపాటి కోటి, విజయ్ కుమార్, సిద్ధిక్ బాష, గోపాల్, సూరి తదితరులు పాల్గొన్నారు.

భూమన అభినయ్ అభివృద్ధి ఆనవాళ్లు ఉండకూడదా..!



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు, సభ్యులు

తిరుపతి సిటీ: మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ నగరంలో చేసిన అభివృద్ధి ఆనవాళ్లను చెరిపేసే దిశగా నగరపాలక సంస్థ అధికారులు, అధికార పార్టీ నేతలు ప్రవర్తించడం దారుణమని, నగరాభివృద్ధికి గొడ్డలి పెట్టు అని వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు మద్దాలి శేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో మీకోసం – ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సోమవారం ఆయన పార్టీ కార్యకర్తలతో కలసి కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న డబుల్ డెక్కర్ బస్సు వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అదే విధంగా జగనన్న హయాంలో తిరుపతిలో ఏర్పాటు చేసిన మాస్టర్‌ప్లాన్ రోడ్లలోని శిలాఫలకాలను కొందరు ఆకతాయిలు ధ్వంసం చేశారని, వాటిని తిరిగి పునరుద్ధరించాలన్నారు. వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ సభ్యులు పాల్గొన్నారు.

పశువులు లేనివారికి గోకులం షెడ్లా ?



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భాకరాపేట(చంద్రగిరి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధిహామీ పథకంలో అవినీతి పెరిగిపోయిందని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు సింహాల మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం చిన్నగొట్టిగల్లు ఎంపీడీఓ గిడ్డయ్యకు పార్టీ శ్రేణులతో కలసి ఆయన ఉపాధిహామీలో జరిగిన అవకతవకలపై వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశువులు ఉన్నవారిని కాకుండా.. లేనివారికి గోకులం షెడ్లు మంజూరు చేయడం అవినీతి కాదా ? అని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. మండల వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు మునిరెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు హరినాథ్, నాయకులు కుమార్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, నరసింహారెడ్డి, మణి, ఉమాపతి, కొండారెడ్డి, ఖదీర్ అహ్మద్, దినేష్ రెడ్డి, రఘునాథ్, సుధాకర్, విజయ్ కుమార్, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు

తిరుపతి కల్చరల్: యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఈనెల 8, 9, 10 తేదీల్లో మూడు రోజుల పాటు సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు జరుగనున్నాయి. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా సీపీఎం అఖిల భారత కార్యదర్శి ఎం.బేబీ, పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు హాజరుకానున్నారు. 8న ఉదయం 10 గంటలకు రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశం ప్రారంభమవుతుంది. సాయంత్రం 4 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఎంఎస్ సుబ్బులక్ష్మి విగ్రహం నుంచి కచ్చపి ఆడిటోరియం వరకు కార్మికుల ర్యాలీ చేపట్టనున్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అయ్యప్పనాయుడు

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం బ్రాహ్మణపట్టు పంచాయతీ రైతు సేవా కేంద్రంలో సోమవారం తిరుపతి జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ వి.షణ్ముగం ఆదేశాల మేరకు, తిరుపతి రూరల్ మండల యూనిట్ ఇన్‌చార్జ్ దామ అయ్యప్ప నాయుడు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై పానకం గ్రామ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో మొదటగా పీఎండీఎస్ (నవధాన్యాల సాగు) విధానంతో ప్రారంభించాలన్నారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లో భూమిని ఎండ తాకిడి నుంచి ఎలా కాపాడుకోవాలి ? భూమిని 365 రోజులు కప్పి ఉంచడం వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రకృతి వ్యవసాయంలో తయారు చేసుకోవాల్సిన కషాయాలు, జీవామృతం ఘనజీవామృతం తయారీ విధానం వాటి ప్రయోజనాలు గురించి విశదీకరించి చెప్పారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. చివరగా పలువురు ఆదర్శ రైతులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో వీఏఏ జానకిరామ్, పవన్, ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

పకడ్బందీగా జాతర ఏర్పాట్లు

తిరుపతి తుడా: రాష్ట్రంలోనే ప్రత్యేకత కలిగిన గంగ జాతరకు ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళవారం నుంచి జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం ఆమె వివిధ శాఖల అధికారులతో కలసి ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయంలో అమ్మవారి దర్శన ఏర్పాట్లు, ఇందిరామైదానం, క్యూలైన్లు, పొంగళ్లు చేసేందుకు చేపట్టిన ఏర్పాట్ల గురించి అధికారులు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తుడా కార్యాలయంలో వీఐపీల వాహనాలు పార్కింగ్ చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని, మిగిలిన వాహనాలు ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండాచూడాలని పోలీసులకు సూచించారు. కమిషనర్ వెంట రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, ఆర్డీఓ రామ్మోహన్, ఏఎస్పీ రవి మనోహరాచారి, సూపరింటెండెంట్ ఇంజినీర్లు శ్యాంసుందర్, కృష్ణారెడ్డి, డీఎస్పీలు రామకృష్ణాచారి, భక్తవత్సలం, తుడా ఈఈ రవీంద్ర, అన్ని శాఖాధికారులు ఉన్నారు

కార్ల్ మార్క్స్ ఆశయాలను కొనసాగిద్దాం



నివాళులు అర్పిస్తున్న సీపీఐ, ప్రజాసంఘాల నేతలు

తిరుపతి కల్చరల్: కార్ల్ మార్క్స్ ఆశయాలను కొనసాగిద్దామని, నేటి యువతకు మార్క్స్ స్ఫూర్తిదాయకమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తెలిపారు. కార్ల్ మార్క్స్ జయంతి సందర్భంగా సోమవారం బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో మార్క్స్ చిత్రపటానికి పార్టీ శ్రేణులతో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు, కార్యదర్శి పి.మురళి, నగర కార్యదర్శి విశ్వనాథ్, ఏఐటీయూసీ జిల్లా నేత రాధాకృష్ణ, ఏఐఎస్ఎఫ్ నేతలు పాల్గొన్నారు.

46 వినతులు

తిరుపతి తుడా: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 46 వినతులు వచ్చాయని కమిషనర్ మౌర్య తెలిపారు. ఫోన్ ద్వారా నలుగురు తమ సమస్యలు తెలుపగా, 42 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. కమిషనర్ మాట్లాడుతూ ఆయా సమస్యలను విభాగాల వారీగా అధికారులు పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణ

చంద్రగిరి: సిద్ధ సమాధి యోగా శిక్షణ ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఉచితంగా శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుచ్చినాయుడుపల్లి కమ్యూనిటీ హాలు వద్ద బుధవారం సాయంత్రం ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. 14 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ ఈ శిక్షణకు అర్హులన్నారు. వివరాలకు 99514 26531 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఫోరెన్సిక్ ల్యాబ్‌పై అవగాహన

తిరుపతి క్రైం: ఫోరెన్సిక్ ల్యాబ్‌పై అవగాహన సదస్సును డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. పోలీస్ గెస్ట్ హౌస్ నుంచి ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. సాక్ష్యాధారాల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఫోరెన్సిక్ డైరెక్టర్ రాజశేఖర్, నాగరాజు పాల్గొన్నారు.

అర్ధరాత్రి రోడ్లపై టీడీపీ శ్రేణుల హల్‌చల్

- ఎస్పీ ఆదేశాలు బేఖాతర్
- ఫిర్యాదు చేసినా స్పందించని పోలీసులు



అర్ధరాత్రి రోడ్లపై బర్త్‌డే వేడుకల్లో హంగామా చేస్తున్న టీడీపీ శ్రేణులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: తిరుపతి రూరల్ మండలం ఎమ్మార్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో సోమవారం అర్ధరాత్రి నడిరోడ్డుపై టీడీపీ శ్రేణులు బర్త్‌డే వేడుకల పేరిట భారీ కటౌట్‌లను ఏర్పాటు చేసి అరుపులు, కేకలతో నానా హంగామా సృష్టించారు. భయభ్రాంతులకు గురైన ఆ ప్రాంత ప్రజలు, రోడ్లపై వెళ్తున్న సామాన్య ప్రజలకు అక్కడ ఏం జరుగుతుందో అర్థం కాక ఎమ్మార్‌పల్లి పోలీసులకు సమాచారం అందించారు. తాము ఫోన్ చేస్తే పోలీసులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ఫిర్యాదు చేసిన వాహనదారులు అసహనం వ్యక్తం చేశారు.

ఎస్పీ ఆదేశాలు బేఖాతరు..

నగరంలోని రోడ్లపై అర్ధరాత్రుల్లో బర్త్‌డేల పేరిట కేక్‌లు కట్ చేసి హంగామా చేసినా కఠిన చర్యలు తప్పవని ఇప్పటికే ఎస్పీ ఆదేశాలు ఇచ్చారు. అన్ని పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సి ఉంటుందని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. కానీ టీడీపీ శ్రేణులు ఇంత విచ్చలవిడిగా రోడ్లపై హంగామా చేసినా పోలీసులు పట్టించుకోకపోవడంతో పాటు ఎస్పీ ఆదేశాలను బేఖాతరు చేయడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తిరుపతి క్రైమ్ : జీవకోన సమీపంలోని సత్యనారాయణపురం వద్ద సోమవారం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాలు.. కమలాపురానికి చెందిన నరసింహులు (26) సత్యనారాయణపురం వద్ద వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి పూటుగా మద్యం తాగి ప్లాంట్ వద్దే పడుకున్నాడు. ఉదయం మృతదేహంగా కనిపించాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.